క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పమిడిముక్కల: ఈ నెల 9న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ పిలుపునిచ్చారు. వీరంకిలాకు ఇరిగేషన్ బంగ్లా ఆవరణలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా చేపట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరి శివనాగేంద్ర, సీఐటీయూ అనుబంధ విభాగాల నాయకులు ఖాన్, హేమలత, కోకిల నారాయణమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

గుడివాడరూరల్: మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. స్థానిక ఆర్కే జూనియర్ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణ, అనూష తదితరులు ఉన్నారు.

శాకంబరిదేవిగా వాల్మీకేశ్వరిదేవి



పామర్రు:ఆషాఢ మాసం సందర్భంగా వాల్మీకేశ్వరీ అమ్మవారిని శుక్రవారం శాకంబరిదేవిగా అలంకరించారు. కూరగాయలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి సుశీల దంపతుల ఆధ్వర్యంలో పూజలు సంపత్‌కుమార్, ఫణి నిర్వహించారు.

కొండలమ్మకు సారె సమర్పణ



గుడ్లవల్లేరు:ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి పద్మాలపాలానికి చెందిన మహిళా భక్తులు శుక్రవారం సారెను సమర్పించారు. అనంతరం ఆ భక్తుల పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై 10న విచారణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఈ నెల 10న విచారణ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి అనురాధా జంగారెడ్డిగూడెం డీఎల్పీవోను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరగడంతో పాటు అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నట్లు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు డీపీఓకు గతంలో ఫిర్యాదు చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి



గుడ్లవల్లేరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పీవో జి.సంపత్ కుమారి తెలిపారు. డోకిపర్రు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆ కేంద్రంలో వానపాముల ఎరువు తయారీ విధానంపై తగు సూచనలను అధికారులు, సిబ్బందికి ఇచ్చారు. గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు, సిబ్బంది ఉన్నారు.

రిలే నిరహార దీక్షల విరమణ

మండవల్లి:ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ, 11 రోజుల నుంచి రెవెన్యూ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రజలు శుక్రవారం దీక్షలు విరమించారు. తహసీల్దార్ కె.గోపాల్ దీక్ష చేస్తున్న వారితో మాట్లాడారు. వారం రోజుల్లో పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గురజ, పెనుమల్లి, అన్నవరం, దేవరం, వడాలి, కోమర్రు, చేవూరు, గ్రామాల్లో విద్యుత్‌లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను కొట్టివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాడు తప్పు..నేడు ఒప్పా?



రెవెన్యూ స్థలంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు శుభ్రం చేస్తున్న కార్మికులు



గతంలో నిలుపుదల చేసిన సచివాలయ నిర్మాణ పనులు

- రెవెన్యూ స్థలంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు
- అదే స్థలంలో గతంలో సచివాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు
- ప్రస్తుతం ఆ స్థలంలో ఏ విధంగా క్యాంటీన్ నిర్మిస్తారని ప్రజల నిలదీత

పామర్రు:రెవెన్యూ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. రెవెన్యూ శాఖ భవిష్యత్ అవసరాల కోసం ఖాళీగా ఉంచిన స్థలంలో క్యాంటీన్ ఏర్పాటుపై స్థానికుల నుంచి పలు విమర్శలు వస్తున్నాయి. సుమారు 7 నుంచి 8 సెంట్ల ఖాళీ స్థలంలో నిర్మాణం చేసేందుకు శనివారం భూమిపూజ కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రదేశంలో ఉన్న పచ్చని మొక్కలను తొలగించడమే కాకుండా రెవెన్యూ స్థలానికి సరిహద్దుగా ఉన్న ప్రహరీ సైతం కూల్చి వేశారు. రెవెన్యూ స్థలంలో క్యాంటీన్ నిర్మాణం సరికాదని కొందరు అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయమై ఆ ప్రజా ప్రతినిధి ఏమైనా ఉంటే నేను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని అనడంతో వాళ్లు ఏమీచేయలేక మిన్నకున్నారు.

గతంలో సచివాలయ భవన నిర్మాణం నిలుపుదల....

ఇదే రెవెన్యూ స్థలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సచివాలయం ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించి ఫౌండేషన్ గోడల వరకు నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణం తగదని రెవెన్యూ స్థలంలో సచివాలయాన్ని ఏవిధంగా నిర్మిస్తారని ఉన్నతాధికారులకు స్థానిక టీడీపీ నేతలు కొందరు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా రెవెన్యూ శాఖ విస్తరణ సమయంలో ఇటువంటి నిర్మాణాలు అడ్డు వస్తాయని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అప్పట్లో రెవెన్యూ స్థలంలో నిర్మిస్తున్న సచివాలయం పనులను నిలిపివేశారు. దీని వలన ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

నేడు ఆ నిబంధన వర్తించదా?

గతంలో రెవెన్యూ స్థలంలో సచివాలయ నిర్మాణం చేయకూడదని పనులను నిలుపుదల చేసి ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు నష్టం చేకూర్చిన టీడీపీ నేతలకు ప్రస్తుతం రెవెన్యూ స్థలంలో అన్నా క్యాంటీన్ నిర్మాణం ఏవిధంగా ఏర్పాటు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వానికి ఒక న్యాయం, కూటమి ప్రభుత్వానికి ఒక న్యాయం ఉంటుందా అని స్థానికులు నిలదీస్తున్నారు. ఈ విషయమై మరొకసారి పునరాలోచించి రెవెన్యూ స్థలంలో క్యాంటీన్ నిర్మాణంపై తగు విధంగా న్యాయమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి



వేల్పూరు పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ పద్మారాణి

పమిడిముక్కల: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ-2 పద్మారాణి తెలిపారు. మండలంలోని వేల్పూరు ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి బోసుబాబు విద్యార్థులకు సంవత్సరానికి సరిపడ నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు బహూకరించారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా శుక్రవారం ఎంఈఓ చేతుల మీదగా సామగ్రి పంపిణీ చేశారు. గత 20 ఏళ్లుగా విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందజేస్తున్న బోసుబాబును ఎంఈఓ, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గుండే నానిబాబు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంచిలి గణేష్, పాతూరి చంద్రపాల్, కోడెబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం



కక్షిదారులకు రాజీపత్రాన్ని అందజేస్తున్న న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్:మధ్యవర్తిత్వం నడిపి సులువైన మార్గంలో కేసులు పరిష్కరిస్తున్నట్లు న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇరుపక్షాల కక్షిదారులను సమన్వయపర్చి 90 రోజుల్లో కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా విడాకులకు దాఖలు చేసుకున్న ఒక జంటకు మూడుసార్లు మధ్యవర్తిత్వం వహించి వారిని ఏకం చేశామని తెలిపారు. జూలై 1వ తేదీ నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు 90 రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బు ఆదాచేసుకోవచ్చన్నారు. మండల న్యాయసేవాధికార కమిటీ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ

పమిడిముక్కల: మొహరం సందర్భంగా షియా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అలీనఖీపాలెం నుంచి వీరంకిలాకు వరకు ముస్లింలు సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సంఘీభావ యాత్రలో పాల్గొన్నారు. వీరంకిలాకు పీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య ఆదర్శనీయులు



రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘు నాయకులు

పామర్రు: మాజీ సీఎం కె.రోశయ్య నేటి తరం నాయకులకు ఆదర్శనీయులని ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష కార్యదర్శులు బొగ్గరపు జాలయ్య, మానేపల్లి రఘురాం తెలిపారు. రోశయ్య జయంతిని పురస్కరించుకుని గుడివాడ రోడ్డులోని కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు బొగ్గరపు సాయిబాబు, మండా కమలాకర్‌నాథ్ చిన్నం ఆది నారాయణమూర్తి, ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, ఊటుకూరి పిచ్చేశ్వరరావు, చిన్నం భాస్కరరావు, తాళ్లూరి నరేష్, పుల్లారావు, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి జయ శ్యామల మాల్యాద్రి కొనియాడారు. రోశయ్య జయంతి పురస్కరించుకుని కైకలూరులో మాల్యాద్రి కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. పెన్మత్స త్రినాథరాజు, మహమ్మద్ జానీ, పైడిమర్రి రాధాకృష్ణ, సనిశెట్టి కొండలు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వంగవీటి మోహన రంగా



పామర్రు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



గుడివాడలో రంగా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామర్రు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు తిరుమలశెట్టి వాసు, కాకర్ల వెంకటేశ్వరరావు, తాడిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించి పేదల పెన్నిధిగా కీర్తించబడిన గొప్ప నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు ఎస్‌సురేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, పామర్తి వెంకట్, పెయ్యల రాజు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు. పామర్రు తోటలోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాపర్ల లోని వంగవీటి రంగా విగ్రహానికి సైతం నివాళులర్పించారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, గుంపా గంగాధరరావు, చాట్ల రమేష్, మధు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏజీకే హైస్కూల్ వద్ద గల మోహన్‌రంగా విగ్రహానికి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ గుడివాడ ఇన్‌చార్జ్ దుక్కిపాటి శశిభూషణ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నాయకులు పాలేటి చంటి, కె. ఆంజనేయ ప్రసాదు, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాము, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని వేల్పూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి బోసుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య పూలమాలేసి నివాళులర్పించారు.ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, మండల పార్టీ ఉపాధ్యక్షులు పాతూరి చంద్రపాల్, కోడెబోయిన కోటేశ్వరరావు, పార్టీ నాయకులు బొల్లా రాంబాబు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సంతబజారులోని రంగా విగ్రహానికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, గంటా సంధ్య, మోత్రు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా నేటి యువతకు ఆదర్శనీయులని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, కూటమి నాయకుడు గుడివాడ చిట్టిబాబు అన్నారు. స్థానిక సెంటరులో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కైకలూరు: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో రంగా విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కూటమి నేతలు కొల్లి బాబీ, తులసి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ తవ్వకంలో వివాదం.. వ్యక్తికి గాయాలు

ముదినేపల్లి రూరల్: డ్రెయిన్ తవ్వకం విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని దేవపూడిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కట్టా నాగరాజు ఇంటి ముందు గూడవల్లి ముసలయ్య, ఏసు, శ్రీను అనే వ్యక్తులు వాడుక నీరు బయటకు వస్తున్నదంటూ నాగరాజుతో ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగ్గా సుబ్బయ్య నాగరాజుపై కర్రతో తలపై దాడి చేయగా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గాయపడ్డ నాగరాజును చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై వీరభద్రరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పింగళి వెంకయ్యకు నివాళి

భట్లపెనుమర్రు(మొవ్వ): జాతీయ పతాక రూప శిల్పి పింగళి వెంకయ్యను ఆదర్శంగా తీసుకుని యువత దేశ రక్షణకు ముందుకు రావాలని ఎంపీపీ కొండేటి ఇందిర తెలిపారు. వెంకయ్య స్వ గ్రామమైన మొవ్వ మండలం భట్లపేనుమర్రు గ్రామంలో శుక్రవారం వర్ధంతి నిర్వహించారు. సర్పంచ్ మట్టా ఇందిర, ఎంపీపీ ఇందిర పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మట్టా సతీష్, చందు, సంగిశెట్టి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి వి.ప్రభు కుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు గుడ్లవల్లేరులో ఉచిత వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: మండల కేంద్రంలోని గ్యాస్ట్రో ఎంట్రాజిలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరాల్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో పలువురు వైద్యులు ఎముకలు, కీళ్లు, నడుము, షుగర్, థైరాయిడ్, సాధారణ వైద్య పరీక్షల వంటి వైద్యాన్ని అందించనున్నారని డాక్టర్ వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఉచిత మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, అధికారులు



కోసూరులో సీతారామ రాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడరూరల్:నేటి యువత అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో బీవై విష్ణుప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో కలసి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

కోసూరు(మొవ్వ):గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిందా వీర వెంకట నాగేశ్వరరాజు, మహాశి నాగరాజు, బోరుకాటి వెంకటేశ్వర రాజు, బోరుకాటి రామరాజురావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మస్తాన్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఆర్ఐ విజయ దుర్గ, పలువురు వీఆర్‌వోలు పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లి(పామర్రు):అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో అలూరి జయంతి శుక్రవారం నిర్వహించారు.

పమిడిముక్కల: ఉద్యమ జ్వాల అల్లూరి సీతారామరాజు అని ఎంఈఓ-1 పద్మారాణి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా జరిపారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఏఓ గోలి రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ క్షత్రియ సేవాసమితి, మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ, ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ తదితర స్వచ్ఛంద సేవాసంస్థలు స్థానిక మెయిన్ రోడ్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కె. రామారావు, డి. శ్రీనివాసరావు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష సీతారామ స్వామి, కార్యదర్శి ఎన్. పద్మజ, కోశాధికారి బి. రాధాకృష్ణ, క్షత్రియ సేవా సమితి గుడివాడ అధ్యక్షుడు కె. వీర్రాజు, గౌరవ అధ్యక్షుడు జి. గజరాజు, కోశాధికారి కె. శ్రీనివాసరావు, ఎస్ ఉదయ్ భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు:మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అల్లూరి చిత్ర పటానికి ఇన్‌చార్జి ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ జగన్మోహనరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కషాయాల తయారీపై అవగాహన

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో గౌతమ్ న్యాచురల్స్ ప్రకృతి వ్యవసాయ వనరుల ఉత్పత్తుల కేంద్రం వద్ద శుక్రవారం బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉండే విధంగా 50 లీటర్ల బ్రహ్మాస్త్రం సామూహికంగా తయారు చేశారు. కార్యక్రమంలో గౌతమ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ నాగవిజయ, ఐసీఆర్పీలు నాగవాణి, నళిని, వీఓఏ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ముస్తఫా

పామర్రు:యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఉర్దూ పాఠశాల ఎస్‌జీటీ ఎస్‌కె ముస్తఫాను శుక్రవారం ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు నీలం ప్రభాకర్, కార్యదర్శి నరేంద్ర పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శొంఠి అంకరవి, మండల కార్యవర్గ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ నమోదు చేసుకోండి

పమిడిముక్కల: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు అర్హత కలిగియుండి, అర్హుల జాబితాలో పేరు లేని వారు సంబంధిత ఆధారాలు తీసుకొని రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఏఓ గణేష్‌రెడ్డి రైతులకు సూచించారు. రైతు సేవా కేంద్రాలలో గ్రీవెన్స నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

పెండింగ్ ఇళ్లు నిర్మించాలి

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టి పెండింగ్‌లో నిలిచిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో బీవై విష్ణుప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సెంట్రింగ్ మేస్త్రిలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తొలుత ఏయే గ్రామాల్లో ఎంత మేర ఇళ్ల నిర్మాణాలు జరిగాయి, ఏయే దశల్లో ఉన్నాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, సెంట్రింగ్ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన నిందితులకు జైలు

తోట్లవల్లూరు: ఆర్టీసీ బస్ కండక్టర్ విధులకు ఆటంకం కలిగించిన వారికి జైలు శిక్ష ఖరారైనట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు. అవనిగడ్డ-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే కరకట్ట ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సును 2020 ఫిబ్రవరి 28న శ్రీకాకుళం వద్ద జటావత్ ప్రదీప్ అనే యువకుడు ఎక్కాడు. టిక్కెట్ తీసుకునే విషయంలో కండక్టర్ రాజనాల సుధీర్‌తో గొడవపడ్డాడు. గొడవ గురించి తన తండ్రి జటావత్ వీరభద్రరావుకు ఫోన్‌లో తెలియచేశాడు. వీరభద్రరావు బస్సును వెంబడిస్తూ వచ్చి తోట్లవల్లూరు వద్ద బస్సును ఆపి కండక్టర్ సుధీర్‌తో గొడవపడి దూషించటమే కాకుండా చేయి చేసుకున్నాడు. దీనిపై కండక్టర్ సుధీర్ తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జటావత్ ప్రదీప్, వీరభద్రరావుపై పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. కోర్టులో ఐదేళ్లపాటు సుదీర్ఘంగా సాగిన వాదోపవాదనల అనంతరం కండక్టర్ సుధీర్ విధులకు ఆటంకం కలిగించిన జటావత్ ప్రదీప్‌కు ఏడాది జైలు శిక్ష, బస్సును నిలువరించి, కండక్టర్‌పై చేయి చేసుకున్న జటావత్ వీరభద్రరావుకు 13 నెలల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ పదో అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె. శ్రీహరి శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ తాతా మాధవిలత హాజరయ్యారని పేర్కొన్నారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో పమిడిముక్కల సీఐ వై. చిట్టిబాబు సహకారంతో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసినట్లు వివరించారు.

సింగయ్యపై చంద్రబాబు వ్యాఖ్యలు ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న విక్టర్, దళిత సంఘాల నాయకులు

గుడివాడరూరల్: ప్రమాదవశాత్తూ మరణించిన దళిత వ్యక్తి సింగయ్యను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుక్కతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ అన్నారు. గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఎం చంద్రబాబుపై విక్టర్ దళిత సంఘాలతో కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ సింగయ్య మరణాన్ని చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూడటం హేయమైన చర్య అన్నారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, దళిత సంఘాల నాయకులు కలపాల కిరణ్ కుమార్, కైలే అశోక్, ప్రసాద్, రవి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుడికి ఘన నివాళి

ముదినేపల్లి రూరల్: భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాన్ని ముదినేపల్లిలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న వివేకానందుడి విగ్రహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఒత్తిమిల్లి ప్రసాద్, వీరబాబు, కొల్లి ఫణీంద్ర పాల్గొన్నారు.

గుడివాడ టౌన్:స్వామి వివేకానంద వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లోని వివేకానందుని విగ్రహానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం. రామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివేకానందుని గొప్పదనాన్ని వక్తలు వివరించారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు బి. గోపిక, ఎల్ రాంబాబు, చరణ్, సత్య, ఎ. రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గుడివాడ టౌన్: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. బాలాజీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఎలక్ట్రికల్ బస్‌లను ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేయాలని, డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ రమణ, కేఎస్ రావు, నాయకులు సుబ్రహ్మణ్యం, కె. వాణి, పి. కొండలరావు, ఎస్.వి. సాయి కుమార్, ఎస్‌కె ఆజీ భాషా తదితరులు పాల్గొన్నారు.